క్లుప్తంగా

రేపు వెంకన్న ఆలయంలో ముక్కోటి పూజలు

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా (వైకుంఠ) ఈ నెల 10 వ తేదిన స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తెల్ల వారుజాము 5.30 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వారదర్శనం, అర్చనలు, పూజలు, ప్రసాద వితరణ, మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం ఆలయం ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ, ఆనంతరం భజన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆనంతరం భక్తులకు చద్ది ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలు విజయవంతం చేయాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

పశువైద్యాధికారి మణిదీప్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మణిదీప్

మాకవరపాలెం: పశువైద్యాధికారిగా మణిదీప్ బాధ్యతలు చేపట్టారు. ఐదు నెలల క్రితం ఇక్కడి వైద్యాధికారికి బదిలీ అయింది. కోటవురట్ల మండలం జల్లూరు వైద్యాధికారి ప్రతాప్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. నూతనంగా మాకవరపాలెం పశువైద్య కేంద్రానికి మణిదీప్‌ను నియమించడంతో బుధవారం ఆయన విధుల్లో చేరారు. ఈ కేంద్రం పరిధిలో ఉన్న పాడి పశువులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనను గిడుతూరు, వజ్రగడ కేంద్రాల వెటర్నరీ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటి బోరు ఏర్పాటు



బోరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గొలుగొండ : మండల కేంద్రంలోని రెల్లి కాలనీలో తాగునీటి బోరు ఏర్పాటు వల్ల ఈ కాలనీ వాసులకు ఇబ్బందులు లేవని సర్పంచ్ కసపల్లి బుజ్జి తెలిపారు. పంచాయతీ నిధుల నుంచి ఈ బోరును బుధవారం ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. దీని వల్ల ఈ ప్రాంతంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేవని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం డైరెక్టర్ రమేష్, టీడీపీ నేత గండేపల్లి రాముతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సంఘం కమిటీ సభ్యులు

నర్సీపట్నం: నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978–80లో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు ప్రైవేటు కళ్యాణ మండపంలో బుధవారం సమావేశమయ్యారు. విద్యార్థి దశ నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకరిని ఒకరు అప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి అధ్యాపకుల బోధన, అనుబంధాల గురించి గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా మూర్తి, కార్యదర్శి పి.అచ్యుతం, కోశాధికారి కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ప్రకాష్, ఉపకార్యదర్శి జి.డి.ప్రసాద్, మరో తొమ్మిది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మకరజ్యోతి ఉత్సవ రాట



ముహూర్తం రాటను ప్రతిష్టిస్తున్న కౌన్సిలర్ రాజేష్ దంపతులు, సంఘం ప్రతినిధులు

నర్సీపట్నం : శ్రీస్వామి అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి మహోత్సవాలకు ముహూర్తపు రాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కౌన్సిలర్ చింతకాయల రాజేష్ దంపతుల చేతుల మీదుగా ముహూర్తపు రాట వేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మకరజ్యోతి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని రాజేష్ పేర్కొన్నారు.

సదుపాయాలు కనుమరుగు

- ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల సమస్య
- మహిళా ఉద్యోగులకు నిత్యం పాట్లు
- దేవరాపల్లి సచివాలయం–2లో బాత్‌రూమ్ బేసిన్లు బిగించని వైనం
- అగ్రికల్చర్, విలేజ్ క్లినిక్, పశువైద్యశాలల్లో నీటి సదుపాయం లేమి
- విద్యాశాఖ కార్యాలయంలో కూలిన మరుగుదొడ్లు
- ఉద్యోగుల ఇక్కట్లు పట్టించుకోని అధికారులు, పాలకులు



రన్నింగ్ నీటి సదుపాయం లేని విలేజ్ హెల్త్ క్లినిక్



దేవరాపల్లి పశువైద్యశాలలో బకెట్లతో నీటిని తెచ్చుకుంటున్న సిబ్బంది



దేవరాపల్లి ఎంఈవో కార్యాలయం వద్ద కూలిన మరుగుదొడ్లు

దేవరాపల్లి : మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులు, సిబ్బందిని మరుగు సమస్య వెంటాడుతోంది. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల సదుపాయం లేకపోగా, మరికొన్ని కార్యాలయాల్లో రన్నింగ్ వాటర్ సదుపాయం లేక ఉద్యోగులు, సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. ఉద్యోగినులు, సిబ్బంది అవస్థలు వర్ణనాతీతం.

దేవరాపల్లి సచివాలయ–2లో మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు ఉన్నప్పటికీ బేసిన్లు బిగించ లేదు. నీటి సదుపాలయం సైతం లేదు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ రన్నింగ్ వాటర్ సదుపాయం లేక పోవడంతో అక్కడ పనిచేసే మహిళా ఉద్యోగులు, సిబ్బంది సమీపంలోని బోర్లు, ఇళ్ల నుంచి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వ్యవసాయ కార్యాలయం, పశువైద్య శాలలో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నీటి సదుపాయం లేదు.

విద్యాశాఖ కార్యాలయంలో కూలిన మరుగుదొడ్డి...

విద్యాశాఖ కార్యాలయానికి అనుకొని ఉన్న మరుగుదొడ్లు ఇటీవల అకస్మాత్తుగా కూలిపోయాయి. దీంతో అక్కడి విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితో పాటు నిత్యం కార్యాలయానికి వచ్చే మహిళా ఉపాధ్యాయినిలు మరుగు కోసం నరకయాతన పడుతున్నారు. మరుగుదొడ్ల కూలిపోయి రెండు నెలల గడుస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాల్లోని పరిస్థితి ఇలా ఉంటే సామాన్య ప్రజల సమస్యలపై ఎలా స్పందిస్తారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.



దేవరాపల్లి సచివాలయం–2లో బాత్‌రూమ్ బేసిన్లు బిగించని పరిస్థితి

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



ఏయే కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేవో, నీటి సదుపాయం లేదో క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం. అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లను తక్షణమే పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి తదుపరి చర్యలు చేపడతాం. మిగిలిన కార్యాలయాల్లో మరుగుదొడ్ల సదుపాయం, నీటి సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తాం.

–ఎం.వి.సువర్ణరాజు, ఎంపీడీవో, దేవరాపల్లి

శతశాతం ఫలితాల సాధనే లక్ష్యం

రోలుగుంట : పది పరీక్షల్లో శత శాతం ఫలితాలు చేపట్టే లక్ష్యంతో విద్యాశాఖ వంద రోజులు యాక్షన్ ప్లాన్ ప్రక్రియ చేపట్టింది. దీనిలో భాగంగా ప్రతి మండలంలోను ఎంఈవోలు ఫోర్‌మెన్ కమిటీని ఏర్పాటు చేసి జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించి పదో తరగతి విద్యార్థులను నేరుగా కలిసి వారితో మాట్లాడారు. పాఠశాలలో బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకున్నారు. మండల విద్యాశాఖాధికారి –1, జానుప్రసాద్, ఎంఈవో–2 జగ్గారావు, జె.నాయుడుపాలెం, బుచ్చింపేట కాంప్లెక్సు హెచ్‌ఎంలు దాడిశెట్టి రమేష్‌కుమార్, శేఖర్‌లు బుధవారం స్థానిక కేజీబీవీ కొవ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలు సందర్శించారు. గుర్తించిన లోపాలపై సబ్జెక్టు టీచర్లకు తెలియజేసి వాటిని ఎలా సవరించాలో సూచనలు చేశారు. శతశాతం ఫలితాలు సాధనే లక్ష్యంగా మేలైన బోధన అందించాలని సూచించారు.



విద్యార్థులకు ఫలితాల సాధనపై సూచనలు చేస్తున్న ఎంఈవో

పిండ్రంగిలో రెవెన్యూ సదస్సు

కె.కోటపాడు : భూ సమస్యల పరిష్కారానికి ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు చక్కని వేదిక అని మండల సర్వేయర్ రామచంద్రమూర్తి అన్నారు. పిండ్రంగి గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఎనిమిది మంది నుంచి ఆయన అర్జీలను అందించారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రామచంద్రమూర్తి అన్నారు. సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, ఎంపీటీసీ నెక్కల గోపి, వీఆర్వో శివ పాల్గొన్నారు.

రామాలయం ఎదుట షెల్టరు ఏర్పాటు



కె.జె.పురం రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన షెల్టరు

మాడుగుల రూరల్ : కె.జె.పురం రామాలయం ముందు భారీ షెల్టరును దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, మరికొందరు దాతల సహకారంతో సుమారు రూ.రెండున్నర లక్షల వ్యయంతో ఈ షెల్టరు నిర్మించారు. దీంతో వేసవిలోనూ, వర్షాకాలంలో భక్తులకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.

పెదమదీనలో ఘనంగా మేలుకొలుపులు



పెదమదీనలో మేలుకొలుపు పూజలో పాల్గొన్న గ్రామస్తులు



అర్జునగిరిలో మేలుకొలుపులు

బుచ్చెయ్యపేట : పెదమదీన గ్రామంలో భోగి రోజున జరిగే భారీ అన్న సమారాధనకు మేలుకొలుపు భక్తులు తగిన ఏర్పాట్లు చేశారు. గత నెల 16వ తేదీ నెల గంట పెట్టినపుడు నుంచి ప్రతి రోజూ గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 13వ తేదీన భోగి రోజున మేలుకొలుపు బృంద సభ్యులంతా కలిసి రామాలయం వద్ద భారీ అన్న సమారాధనకు ఏర్పాట్లు చేశారు. అలాగే భోగి రోజున జరిగే అన్న సమారాధనకు అవసరమైన కట్టెలను ఏరి ట్రాక్టర్‌పై రామాలయానికి తరలించారు.

చీడికాడ : ధనుర్మాసోత్సవాలు పురస్కరించుకుని, అర్జునగిరి గ్రామంలో మేలుకొలుపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్థానిక స్వయం భూ శ్రీ వరాహలక్ష్మి నృసింహ స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో స్వామి వారి భక్తి గీతాలను ఆలపిస్తూ తెల్లవారుజామున గ్రామ పురవీధుల్లో తిరిగారు. ఈ నెల 13 వ తేదీ భోగి పండగ వరకు ఈ మేలుకొలుపు జరుగుతుందని భక్తులు పేర్కొన్నారు.

కె.కోటపాడు : ధనుర్మాసంలో ప్రతి రోజూ వేకువజామున నిర్వహించే పూజల్లో పాల్గొనే భక్తులకు చౌడువాడలో గల సీతారామాంజనేయ ఆలయ అర్చకుడు దార్లపూడి సాయిరాం బుధవారం బహుమతులను అందించారు. ధనుర్మాసం ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి రోజూ గ్రామంలో నిర్వహిస్తున్న మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొన్న 110 మంది భక్తులకు ఆలయ అర్చకుడు సాయిరాం తన సొంత నగదు రూ.10వేలతో బహుమతులను కొనుగోలు చేసి అందించారు. మేలు కొలుపు కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు భక్తిభావంతో పాటు ఆరోగ్యం కలగనున్నట్టు సాయిరాం తెలిపారు. కార్యక్రమంలో సీతారామాంజనేయ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భక్తులకు బహుమతులను అందిస్తున్న అర్చకుడు

టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్



మోడల్ టెస్ట్ రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

నర్సీపట్నం : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నర్సీపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. ప్రశ్న పత్రాన్ని టౌన్ ఎస్ఐ రమేష్, హెచ్‌ఎం మాధవి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మోడల్ పరీక్ష ద్వారా విద్యార్థులకు పబ్లిక్ పరీక్షపై అవగాహన ఏర్పడుతుందని, వారిలో ఉన్న భయం తొలగుతుందని అన్నారు. విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాన్ని పెంపొందించాలనే ఆలోచనతో మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ పేర్కొన్నారు. సెలవుల అనంతరం ఫలితాలు వెలువడతాయని, మంచి ప్రతిభ కనబరిచిన 15 విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

పాఠశాలలో వేడుకగా సంక్రాంతి సంబరాలు



పాఠశాలలో భోగి వేడుక నిర్వహణలో శివాజీరాజు, తదితరులు

- ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

కె.కోటపాడు : సంక్రాంతి పర్వదినం సమయాల్లో నిర్వహించే రంగవల్లుల పోటీలు సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు అన్నారు. చౌడువాడ శ్రీ సాయి విద్యావిహార్ పాఠశాలలో బుధవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలను విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలతో ప్రారంభమైన కార్యక్రమాలు హరిదాసు వేషధారణతో పాటు విద్యార్థినులకు రంగవల్లుల పోటీలతో ముగిసారు. సంక్రాంతి విశిష్టతను వివరించే విధంగా వేసిన రంగవల్లులు పలువురిని ఆకట్టుకున్నాయి. సంప్రదాయం ప్రతిబింబేలా రంగవల్లులను వేసిన విద్యార్థినులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దీవి అప్పలకొండ(దత్తు), ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, యోగా గురువు పుల్లేటి సతీష్, ఉపాధ్యాయినులు రత్నం, గణేశమ్మ పాల్గొన్నారు.

క్రషింగ్‌కు నోచుకోని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ



సభ్య రైతులతో కలిసి మాట్లాడుతున్న సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు

చీడికాడ: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ నేటికీ క్రషింగ్‌కు నోచుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని చోడవరం చెరకు అభివృద్ధి మండలి(సీడీసీ) చైర్మన్ సుంకర శ్రీనివాసరావు అన్నారు. చెరకు రైతులతో కలిసి ఆయన బుధవారం ఖండివరంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఏటా నవంబర్ మొదటి వారంలో క్రషింగ్ ప్రారంభించేవారని, ఇప్పుడు జనవరి మొదటి వారం పూర్తయినా ప్రారంభం కాలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రూ.89 కోట్లు ఆర్థిక సహాయం అందించిందన్నారు. ప్రస్తుతం ఫ్యాక్టరీని పట్టించుకునే వారే లేకుండా పోయారని అన్నారు.

ఆరోగ్య పింఛన్ల తనిఖీ



మంచాల గ్రామంలో దివ్యాంగుడి పింఛను తనిఖీ చేస్తున్న వైద్యులు

చీడికాడ : మండలంలో ఆరు సచివాలయాలల్లో ఆరోగ్య పింఛన్లు (రూ.15 వేలు పింఛన్లు) పొందుతున్న వారిని విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రికి చెందిన ఎముకల వైద్యులు బుధవారం తనిఖీ చేశారు. మండలంలో 17 మందిని కింగ్‌జార్జి ఆస్పత్రి ఎముకల వైద్యులు డాక్టర్ పి. ప్రదీప్, రెడ్డి జగన్నాథరావు, చీడికాడ, పెదగోగాడ పీహెచ్‌సీ వైద్యుడు సునీల్‌కుమార్, కె. ఉషాచైతన్య, పింఛను పొందుతున్న ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి పరిశీలించారు. కోనాం, తురువోలు సచివాలయాల్లో ముగ్గురు చొప్పున, చీడికాడ 4, అప్పలరాజుపురం 5, అర్జునగిరి, బైలపూడిలో ఒక్కో పింఛనుదారులను పరిశీలించారు.

మాకవరపాలెం : దివ్యాంగ పింఛన్లపై బుధవారం మండలంలోని జీ వెంకటాపురం, తామరం, మాకవరపాలెం, బి.ఎస్.పేట, లచ్చన్నపాలెం, శెట్టిపాలెం, రాచపల్లి గ్రామాల్లో ప్రత్యేక బృందాలు రూ.15వేలు పింఛను నగదు పొందే లబ్ధిదారులను విచారణ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు.

మోదీ సభకు తరలివెళ్లిన డ్వాక్రా మహిళలు



కింతలి నుంచి బయలుదేరిన బస్సులతో మహిళలు



జాలంపల్లిలో బస్సును ప్రారంభిస్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

మాడుగుల రూరల్ : ప్రధాని నరేంద్ర మోదీ సభకు మండలంలో అన్ని గ్రామాల నుంచి మహిళలు, నాయకులు బస్సుల్లో బుధవారం విశాఖకు తరలి వెళ్లారు. కె.జె.పురం గ్రామం నుంచి రెండు బస్సుల ద్వారా 125 మంది బయలుదేరి వెళ్లారు. ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశాల మేరకు తరలించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు పుట్టా రాంబాబుతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు. కింతలి, వల్లాపురం గ్రామాల నుంచి 40 మంది బయలుదేరి వెళ్లారు. వెలుగు వీఓఏలు సారథ్యంలో జన సమీకరణ చేశారు. మండలంలో 25 బస్సుల ద్వారా 1280 మందిని విశాఖ మోదీ పర్యటనకు తరలించినట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు.

మాడుగుల : విశాఖలో జరిగిన ప్రధాని మోదీ సభకు మాడుగుల మండలంలో 29 పంచాయతీల నుంచి 1280 మంది బుధవారం తరలి వెళ్లారని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మండలంలో నలు మూలలు నుంచి వచ్చిన బస్సులు వడ్డాది జంక్షన్‌లో కలసి అక్కడ నుంచి బయలుదేరి వెళ్లాయన్నారు. వెలుగు సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది జనాన్ని దగ్గరుండి బస్సులు ఎక్కించారని ఎంపీడీవో తెలిపారు.

నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ప్రారంభం



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కొండబాబు

నాతవరం : సంక్రాంతి పండగ సందర్భంగా కేఎస్ఆర్ గ్రూపు ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించడం చాలా ఆనందదాయకమని తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీపీ విజయకుమార్ అన్నారు. అటవీశాఖ స్థలంలో కేఎస్ఆర్ గ్రూపు సభ్యులు నియోజకవర్గ స్థాయి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. ఆయా పోటీలను బుధవారం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ ప్రతి ఏటా కేఎస్ఆర్ గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో సంక్రాంతికి పోటీలు ఏర్పాటు చేయడం యువతకు ఉపయుక్తంగా ఉందని అభినందించారు. క్రికెట్ పోటీలకు 31 జట్లు, వాలీబాల్, కబడ్డీ 15 జట్లు చొప్పున పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైల పోతురాజు, తాండవ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటర్ కమిటీ డైరెక్టరు పారుపల్లి దాసు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బంగారు సూరిబాబు, ఆటల పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు శెట్టి లోవ, శెట్టి నానాజీ , శెట్టి గోపి, నాతవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టరు సీతారామమూర్తి, చింతకాలయ శ్రీను, అంకంరెడ్డి యర్రాపాత్రుడు, సామర్ల రామారావు పాల్గొన్నారు.

క్రికెట్, వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.8 వేలు, కబడ్డీలో వరుసగా రూ. 12 వేలు, రూ.9 వేలు, రూ.5వేలు చొప్పున నగదు బహుమతులు, షీల్డులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

క్విజ్ పోటీల్లో బహుమతి



ప్రశంసా పత్రాలను అందుకుంటున్న విద్యార్థులు

దేవరాపల్లి : రాష్ట్ర విద్య పరిశోధక శిక్షణ మండలి (ఎస్‌సిఈఆర్‌టీ) రంగోత్సవ పోటీలలో భాగంగా భీమునిపట్నం ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో ఈ నెల 7న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో కాశీపురానికి చెందిన బండారు జశ్వంత్, నూలు లోకేష్ బృందం తృతీయ స్థానంలో నిలిచింది. వీరు జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్, జాయింట్ డైరెక్టర్ జ్యోతి కుమారి, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఆయా విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన కొట్టాన రాంబాబు మాస్టారును స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుందరి, సర్పంచ్ వరలక్ష్మి, ఉప సర్పంచ్ సింహాచలంనాయుడు అభినందించారు.

ఆలయానికి మైక్ సెట్ల వితరణ



ఎం.కోడూరు మోదమాంబ ఆలయానికి మైక్ సెట్లు అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు మోదకొండమ్మ ఆలయానికి దాతల సహకారంతో మైక్ సెట్‌లు సమకూర్చారు. ఆలయం నుంచి ప్రతి రోజు తెల్లవారుజామున, సాయంత్రం సమయంలో భక్తి గీతాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రజలకు వినిపించడానికి స్థానిక ఆర్‌ఎంపీ డాక్టర్ జల్లి హరిప్రసాద్, మెంటా వెంకటరమణ, శీరా పెంటరావు, ఖాతా చిరంజీవి కలిసి రూ.30 వేలు విలువ చేసే నాలుగు మైక్‌సెట్ హారన్స్‌ను సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. కార్యక్రమంలో రాపర్తి సూర్యనారాయణ, అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమణబాబు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఎస్‌బీఐ ద్వారా సైకిళ్ల వితరణ



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న బ్యాంకు ఆర్‌ఎం జగదీశ్వరరావు, చీఫ్ మేనేజర్ పృథ్వి

నాతవరం : భారతీయ స్టేట్ బ్యాంకు ద్వారా ప్రతి ఏటా సీఎస్ఆర్ నిధులతో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఎస్‌బీఐ రీజనల్ మేనేజరు కె.జగదీశ్వరరావు అన్నారు. డి.యర్రవరం హైస్కూల్‌లో బుధవారం పది మంది పేద విద్యార్థులకు సైకిల్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ స్టేట్ బ్యాంకు ద్వారా సీఎస్ఆర్ నిధులతో జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రాంతాల వారీగా అక్కడ పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో హైస్కూల్లో పేద బాలికలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి రావడంతో స్థానిక పెద్దలతో చర్చించి ఉచితంగా సైకిల్ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు చీఫ్ మేనేజర్ ఎ.పృథ్వి, వై.డి.పేట స్టేట్ బ్యాంకు బ్రాంచి మేనేజరు ఎం.శ్రీనివాసరావు, హైస్కూల్ హెచ్‌ఎం ఆకుల కుమారి, ఉపాధ్యాయులు లాలం గణేష్ పాల్గొన్నారు.

సభ్య రైతులందరికీ సంక్రాంతి బోనస్ అందించాలి

మాడుగుల రూరల్ : విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న ప్రతి సభ్య రైతుకు సంక్రాంతి బోనస్ అందించాలని సభ్య రైతులు కోరుతున్నారు. ఇటీవల మూడు మాసాల క్రితం గేదె, ఆవు పాల ధరలు లీటరుకు రెండు రుపాయల చొప్పున తగ్గించారు. అయినా సరే విశాఖ డెయిరీని నమ్ముకుని పాడి రైతులు పాలు సరఫరా చేస్తున్నారు. 2023 మార్చి నెల నుంచి 2024 ఏప్రిల్ 30వ తేదీ వరకు పాలు సరఫరా చేసిన పాడి రైతులకు సరాసరిగా సంక్రాంతి బోనస్‌ను అందిస్తున్నారు. విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేస్తూ మధ్యలో ప్రైవేటు డెయిరీలకు పాలు సరఫరా చేసే రైతులకు బోనస్ నిలుపుదల చేయాలని, విశాఖ డెయిరీ ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. ఎస్ఎన్ఎఫ్ తగ్గడం వల్ల కొందరు పాడి రైతులు ప్రైవేటు పాలసొసైటీలకు పాలు సరఫరా చేస్తున్న నేపథ్యంలో వారికి బోనస్ నిలుపుదల చేయడం తగదని సభ్య రైతులు రాజుబాబు, మద్దాల వెంకట సత్యనారాయణ, శంకర్రావు, కొండలరావు డెయిరీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.